క్లుప్తంగా

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థినికి విద్యా సామాగ్రిని అందిస్తున్న శివారెడ్డి

మైదుకూరు : మండలంలోని సుంకులు గారి పల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం గ్రామానికి చెందిన అంబటి శివారెడ్డి విద్యాసామగ్రి అందజేశారు. పలకలు, కాపీ రైటింగ్ నోట్ బుక్స్, డ్రాయింగ్, కలరింగ్ బుక్స్, క్రేయాన్స్ పిల్లలకు పంపిణీ చేశారు. అదే విధంగా మధ్యాహ్నం విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందిస్తూ, సహకరించిన అంబటి శివారెడ్డికి సుంకులుగారిపల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మిదేవి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, వహీదా పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

ప్రొద్దుటూరు : అనంతపురం లలిత కళా పరిషత్‌లో ఈనెల 25న ఏపీ దళిత సమాఖ్య 22వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నిర్వహించే సభను జయప్రదం చేయాలని దళిత సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి యల్లయ్య మాదిగ తెలిపారు. గురువారం ప్రొద్దుటూరులో దళిత సమాఖ్య ఆవిర్భావం దినోత్సవం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు దళిత సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, దుర్గం సుబ్బారావు, పందిరి అంజయ్య, తెలంగాణ రాష్ట్ర దళిత సమాఖ్య అధ్యక్షులు రామ్మోహన్ రావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి భాస్కర్, నారాయణ, చిన్నయ్య, బాలకుమార్ పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో గురువారం వైద్యులు రాంప్రతాప్‌రెడ్డి కుమారుడు డాక్టర్ సాయిభరత్ రెడ్డి, నివేదితల వివాహ మహోత్సవానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్ పాల్గొన్నారు.

హిందువులపై దాడులు ఆపాలి



మైదుకూరులో మానవహారంగా ఏర్పడిన హిందూ చైతన్య వేదిక నాయకులు

మైదుకూరు : బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ ఆలయాలపై దాడులు ఆపాలని హిందూ చైతన్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. మైదుకూరులో గురువారం సాయంత్రం బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయాలపై, హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక వనిపెంట రోడ్డు నుంచి రాయల కూడలి వరకు సాగింది. హిందువులపై దాడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైట్ వాచ్‌మెన్‌ను నియమించండి



చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నైట్ వాచ్‌మెన్ లేక వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నారు. రాత్రి సమయాల్లో స్టాఫ్ నర్సులు విధులు నిర్వహిస్తుంటున్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు నైట్ వాచ్‌మెన్‌లు ఉండగా ఏడాది క్రితం ఒక వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. మరో వాచ్‌మెన్ మునిస్వామి ఉండగా ఈయన డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది నుంచి రాత్రి సమయాల్లో విధుల్లో ఉండే స్టాఫ్ నర్సులు భయాందోళనలో విధులు నిర్వహిస్తున్నారు. గ్రామానికి అర కి.మీ దూరంలో ఆస్పత్రి ఉండటం జనసంచారం ఉండదు. దీంతో రాత్రిళ్లు ఏ రోజు ఏం జరుగుతోందనే స్టాఫ్ నర్సులు ఆందోళన చెందుతున్నారు. ఇదే క్రమంలో ఆస్పత్రిలో వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. దీంతో ఆస్పత్రి వచ్చే వైద్య సిబ్బందితో పాటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆదమరిస్తే అంతే..!



రామేశ్వరంలో రక్షణ కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బొల్లవరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ప్రొద్దుటూరు పట్టణంలో చిక్కులుగా కనిపిస్తున్న విద్యుత్, డిష్ వైర్లు



మెయిన్‌బజార్‌లోని గాంధీబొమ్మ సెంటర్‌లో స్తంభానికి అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు



అమ్మవారిశాల ప్రాథమిక పాఠశాల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కంచెలేక పోవడంతో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె లేక పోగా, మరికొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు పిల్లల చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. రామేశ్వరం ట్యాంకుల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేదు. అక్కడ ఉన్న పాఠశాల విద్యార్థులు అదే దారిలో వెళుతుంటారు. ఏదైనా ప్రమాదం జరిగినా, పొరపాటున విద్యార్థులు దానిని తగిలినా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అలాగే మిట్టమడి వీధి నుంచి రామేశ్వరం వేళ్లే దారిలో పిల్లలకు అందే విధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు ఉన్నాయి. ఈ దారిలో రెండు పాఠశాలల విద్యార్థులు వెళుతుంటారు. తెలియక తగిలితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని, రక్షణ కంచె ఏర్పాటు చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. అలాగే అమృత గార్డెన్స్ సమీపంలోని కాలువ పక్కన్న ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిన విద్యుత్ స్తంభం కొద్దిగా ఒరిగింది. వర్షాకాలం కావడంతో నేల తడిచి స్తంభం మరింత ఒరిగే అవకాశం ఉందని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, ప్రమాదకరంగా ఒరిగిన స్తంభాలను గుర్తించి వాటిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు,

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని బొల్లవరం ప్రాంతంలో ఆరేళ్లుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పొట్టిపాడు రోడ్డు నుంచి బొల్లవరం ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే దారిలో అధికారులు రెండు అడుగుల ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వలన పిల్లలతోపాటు మూగ జీవాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని గమనించిన స్థానికుడు గురుమోహన్‌రెడ్డి తన సొంత డబ్బు వెచ్చించి ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చేందుకు దిమ్మెను నిర్మించాడు. అయితే కింద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పైన పెట్టాలని అనేక మార్లు విద్యుత్ అధికారుల చుట్టు ప్రదక్షణలు చేస్తున్నారు.. అధికారులు అదిగో.. ఇదిగో అంటూ కాలయపాన చేస్తున్నారు. ఆరేళ్ల అయినా నేటికీ సమస్య పరిష్కారం కావడం లేదు.

- ప్రొద్దుటూరు – పొట్టిపాడు మార్గంమధ్యలో ఇటీవల కాలంలో కొత్తగా విద్యుత్ స్తంభాలను అమర్చారు. స్తంభాలకు కింది వైపున సిమెంటు దిమ్మెలు వేయకపోవడంతో దారి వెంబడి స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయి. ఎప్పుడైనా స్తంభాలు విరిగి పడే అవకాశం ఉందని పంట పొలాలకు చెందిన రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ స్తంభాలకు డిష్ వైర్లు కట్టలు కట్టలుగా కట్టి ఉన్నారు. ఏది విద్యుత్ వైరో.. ఏది డిష్ వైరో కనుగొనలేని అయోమయ పరిస్థితి ఉంది. ప్రొద్దుటూరు పట్టణమంతా పరిస్థితి ఇలాగే ఉంది. అనేక చోట్ల తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు

బద్వేలు అర్బన్ : దశాబ్దాల తరబడి మరమ్మతులకు నోచుకోని విద్యుత్ స్తంభాలు, చేతికందే ఎత్తులో కరెంటు తీగలు, రక్షణ కవచాలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. పట్టణంలోని ప్రతి వీధిలో డిష్ కేబుల్స్, ఇంటర్నెట్ కేబుల్స్ ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలకు అమర్చడంతో చిన్నపాటి గాలి వీచినా తీగలు తెగి పడుతున్నాయి. అలాగే పట్టణంలోని చాలా ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచాలు లేకపోవడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల కింద ఏర్పాటుచేసిన దిమ్మెలు కూలే స్థితికి చేరినా అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



మాట్లాడుతున్న కౌన్సిలర్ సుబ్రహ్మణ్యం

మైదుకూరు : మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి చెందిన ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, అడోలెసెంట్ కౌన్సిలర్ కె.సుబ్రహ్మణ్యం సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రాష్ట్రీయ కిశోర్ స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్, మాదకద్రావ్యాల వినియోగం, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యువత డ్రగ్స్ వినియోగించడం చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. హెచ్ఐవీ అంటు వ్యాధి కాదని, దోమల ద్వారా, ఆహారం ద్వారా ఇది వ్యాప్తి చెందదని తెలిపారు. పలు జాగ్రత్తలు తీసుకొని తమ జీవిత కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. అందుబాటులో ఉన్న వివిధ రకాల మందులను, సంరక్షణ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ అయ్యావారు రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ర్యాలీ



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

పోరుమామిళ్ల : కలకత్తాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ గురువారం పోరుమామిళ్లలో ఎస్ఎఫ్ఐ, వెంకటేశ్వర డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడుతూ అత్యాచారానికి సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. మహిళా రక్షణ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. డాక్టర్లకే భద్రత లేకుంటే మామూలు విద్యార్థినుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.

చేతిరాతతో తలరాత మార్చుకోండి



సర్టిఫికెట్స్‌తో విద్యార్థినులు

పోరుమామిళ్ల : చక్కని చేతిరాతతో తలరాత మార్చుకోవాలని సీఐ శ్రీనివాసులు, ఎంఈఓ బాల అంకిరెడ్డి తెలిపారు. గురువారం ఓఎల్ఎఫ్ బాలికోన్నత పాఠశాలలో చేతిరాత నిపుణులు మల్లేశ్వర్‌రెడ్డి విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ ఇచ్చి మెలుకువలు నేర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐ, ఎంఈవో మాట్లాడుతూ అందమైన చేతిరాత అందరినీ ఆకట్టుకుంటుందని, ప్రతి విద్యార్థి చక్కని చేతిరాతను నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేతిరాతపై పరీక్ష నిర్వహించి మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగు లాభదాయకం



బసనపల్లెలో ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు వివరిస్తున్న ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి

కాశినాయన : రైతులు ఆయిల్‌ఫామ్ పంటను సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బసనపల్లె, కోడిగుడ్లపాడు గ్రామాల్లో ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ, ఆయిల్‌ఫామ్ కంపెనీ సువేనా ఆగ్రో ఇండస్ట్రీస్ కంపెనీ సంయుక్తంగా ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆయిల్‌ఫామ్ సాగు వైపు రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం రాయితీలను ప్రకటించిందన్నారు. ఆయిల్‌ఫామ్ సాగు చేసే రైతులకు హెక్టార్‌కు రూ.29 వేలు విలువ చేసే మొక్కలను ఉచితంగా అందిస్తుందన్నారు. నాలుగు సంవత్సరాల వరకు కలుపులకు, ఇతర సేద్యాలకు రూ.21 వేలు అందిస్తారన్నారు. మొదటి సంవత్సరం ఆయిల్‌ఫామ్ సాగులో కూరగాయలు, పప్పుధాన్యాలు అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చన్నారు. వీటికి కూడా రూ.5,250లు చొప్పున అందిస్తామన్నారు. దీంతో పాటు పంటను సాగు చేసే రైతులకు 90 నుండి 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలను కూడా పొందవచ్చన్నారు. నీటి వనరుల కోసం పొలంలో ఫామ్‌పాండ్స్ చేపడితే మరో రూ.70 వేలు రాయితీ కూడా ఉంటుందన్నారు. పండిన పంటను ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుని కంపెనీ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. పంట నాటిన మూడవ సంవత్సరం నుంచి కోతకు వచ్చి 30 సంవత్సరాల వరకు పంట దిగుబడి వస్తుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఉద్యానశాఖ అధికారిని, లేదా రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి మహేష్, కంపెనీ ప్రతినిధి కొండారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదగాలి



విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న నిర్మలజ్యోతి

కాశినాయన : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తరల్ జిల్లా కో ఆర్డినేటర్ నిర్మలజ్యోతి తెలిపారు. గురువారం మండలంలోని రెడ్డి కొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. జహీరున్‌బీ అనే విద్యార్థి ప్రతిభను ప్రశంసించి బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు, గణితంలో విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేసి ఎలా బోధించాలని వివరించారు. విద్యార్థుల స్థాయిని బట్టి బోధించాలన్నారు. ప్రతి విద్యార్థిపై శ్రద్ధ తీసుకుని బోధనోపకరణాలతో పాఠ్యాంశాలను బోధిస్తే విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి

దువ్వూరు : మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం జరగనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభలు ఒకే రోజు మండల వ్యాప్తంగా జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలో గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తారని, 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళికలను రూపొందించడమే గ్రామ సభ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలు జరుగుతాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు గ్రామ సభలో పాల్గొని పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

నేడు గ్రామసభలు

గోపవరం : ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టబోయే పనుల కోసం శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణయ్య తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించే గ్రామసభల్లో ఏయే పనులు చేపట్టాలి అనే అంశంపై ఆయా గ్రామాల ప్రజలు గ్రామసభలకు హాజరై అధికారులకు అర్జీలు సమర్పించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు మినహాయించి 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బి. కోడూరులో..

బి.కోడూరు : మండలంలోని పది పంచాయతీల్లోని గ్రామాల్లో చేపట్టనున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి శుక్రవారం ఆయా గ్రామ సచివాలయాల్లో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. ఈ గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆమోదం తెలిపిన పనులకు ఆమోదం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం జరుగుతుందని తెలిపారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. 17 గ్రామ పంచాయతీలకు ఒక అధికారిని నియమించామన్నారు. ఉదయం 11 గంటల నుండి 1–30 గంటల వరకు, మధ్యాహ్నం 2–30 గంటల నుండి 5 గంటల వరకు గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఈ గ్రామసభల్లో గ్రామాల్లో మౌలిక వసతులు, రోడ్లు, తాగునీరు తదితర పనులను గుర్తిస్తారని తెలిపారు.

'వయ్యారి భామ'ను నిర్మూలించండి



వయ్యారిభామ మొక్కల గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త బాలకృష్ణ

మైదుకూరు : వయ్యారిభామ మొక్కలను నిర్మూలించాలని మండలంలోని వనిపెంట కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ పిలుపునిచ్చారు. వయ్యారిభామ నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ఆదిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో వయ్యారి భామ వలన కలిగే దుష్పరిణామాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాల్లో ఉన్న వయ్యారిభామ మొక్కలను పీకి వేసి ఎండిన తర్వాత కాల్చేయాలన్నారు.

ఘనంగా ఆరాధనా మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్ర స్వామి బృందావనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని పాత రాఘవేంద్రస్వామి ఆలయంలో గురువారం స్వామి ఆరాధనా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి బృందావనానికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో, వెండి కవచాలతో అలంకరించారు. అలాగే గోపాల కృష్ణునికి పంచామృతాభిషేకం చేసి విశేష అలంకరణ చేశారు. అనంతరం రాఘవేంద్రస్వామి మహిమలపై ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం రథోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులు కాయా కర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై భారీ ర్యాలీ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు : పట్టణ పరిధిలో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ రోడ్డు, రాజీవ్ సర్కిల్, శివాలయం సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ప్లాస్టిక్ వద్దు, పర్యావరణం ముద్దు, ప్లాస్టిక్ వాడకం ప్రాణాలకు ముప్పు అని నినాదాలు చేశారు. అనంతరం శివాలయం సెంటర్‌లో మానవ హారంగా ఏర్పడి ప్లాస్టిక్ వాడకాలపై కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులనే పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా పురోగాభివృద్ధి చెందాలి



మండల సమాఖ్య నూతన పాలకవర్గ సభ్యులతో ఎంపీడీఓ, ఏపీఎం, డ్వాక్రా సిబ్బంది

చాపాడు : స్వయం సహాయక సంఘాల మహిళలు డ్వాక్రా రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా పురోగాభివృద్ధి చెందాలని మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు ఆకాంక్షించారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద గురువారం ఏపీఎం వెంకటరమణ ఆధ్వర్యంలో మండల సమాఖ్య మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య నూతన పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పి.మరియమ్మ, కార్యదర్శిగా ఏ.రామలక్ష్మి, కోశాధికారిగా బి.ఇమాంబి, ఉపాధ్యక్షురాలిగా బి.నాగలక్ష్మమ్మ, ఆర్.గురుదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, యానిమేటర్లు, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకునేంత వరకు దీక్షలు కొనసాగిస్తాం

బద్వేలు అర్బన్ : పట్టణానికి సమీపంలోని సి.కొత్తపల్లె పొలంలో కబ్జాకు గురైన కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని కబ్జాదారులపై చర్యలు తీసుకునేంత వరకు దీక్షలు కొనసాగిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శివకుమార్ తెలిపారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి నాల్గవ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్గం సుగమం

మైదుకూరు : మైదుకూరులో ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసేందుకు భూమి కేటాయింపునకు మార్గం సుగమం అయిందని బీజేపీ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్ రెడ్డి తెలిపారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన వారధి కార్యక్రమంలో భూమి కేటాయింపు సమస్యను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకుపోయినట్టు ప్రతాప్‌రెడ్డి చెప్పారు. ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటు కోసం, తెలుగు గంగ ప్రాజెక్టుకు చెందిన భూమిని కేటాయించే విషయంపై మంత్రికి వినతి పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. దానిపై స్పందించిన మంత్రి సత్యకమార్ యాదవ్, జలవనరుల శాఖ కార్యదర్శి సాయిప్రసాద్‌తో చర్చించగా.. భూమిని జలవనరుల శాఖ నుంచి రెవెన్యూ శాఖకు అప్పగించేందుకు ఆయన అంగీకారం తెలిపారన్నారు. దీనితో నాలుగేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన భూమి కేటాయింపునకు మార్గం సుగమం అయినట్టేనని తెలిపారు.

మంత్రికి వినతి

నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి గురించి గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు విజ్ఞప్తి చేసినట్టు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు తెలిపారు. విజయవాడలో వారధి కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గంలోని ఆస్పత్రుల సమస్యలు, వాటికి కావాల్సిన వైద్య పరికరాలు, వసతులు కల్పించడంపై విన్నవించినట్టు సుబ్బరాయుడు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మైదుకూరు మండల అధ్యక్షులు రామకృష్ణ, చాపాడు మండల అధ్యక్షులు చంద్ర శేఖర్‌రెడ్డి, ఖాజీపేట ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నాగదాసరి ఉదయ్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.